# దైవం

-పి.వైజయంతి

భగవంతుడిని తలచుకుని సముద్రం వైపు చూసాను. హోరుమంటూ ఎగిసిపడుతూ నన్ను అందుకోవడానికే అన్నట్లుగా వస్తున్న అలలను చూస్తుంటే భయమేసింది. అప్రయత్నంగా రెండడుగులు వెనక్కి వేసాను. నా పిరికితనానికి నాకే నవ్వొచ్చింది. చావడానికి వచ్చి అలలను చూసి భయపడితే ఎలా? తప్పదు ముందుకు వెళ్లాల్సిందే. కానీ లోపల ఏదో జంకుగా వుంది. చివరిసారిగా మళ్లీ భగవంతుడ్ని తలచుకున్నాను. కళ్ళు మూసుకుని అడుగు ముందుకు వేద్దామనుకున్నాను.

"ఏం బాబూ! ఆత్మహత్య చేసుకోవడానికి భయమేస్తోందా?'' వెనుక నుంచి ఎవరో అడిగారు.

ఉలిక్కిపడి వెనుదిరిగి చూసాను.

ఒక ముసలాయన నిలుచుని ఉన్నాడు. ముగ్గుబుట్టలాంటి తల, గెడ్డం, కనుబొమలు. నిలువెత్తు రూపం. ప్రశాంతమైన వదనం, అంతకంటే ప్రశాంతమైన కళ్ళు. ఆ కళ్లల్లో ఏదో తెలియని వింత ఆకర్షణ ఉంది. చూపుని మరల్చనివ్వడంలేదు. అతని కళ్లల్లోకే చూస్తూ అచేతనంగా నిలబడిపోయాను.

"ఏం బాబూ! మాట్లాడవేం? చావడానికేనా వచ్చావు?'' మళ్లీ అడిగాడు ఆయన.

నేను సమాధానం చెప్పలేదు. చూపులు మాత్రం మరల్చాను.

నా భుజం చుట్టూ చేయి వేసాడు ఆయన. ఆ స్పర్శకి నా శరీరం చిన్నగా కంపించింది.

"పద... అలా కూర్చుని మాట్లాడుకుందాం'' నా ప్రయత్నమేమీ లేకుండానే ఆయన వెంట నడిచాను.

ఇసుకలో కూర్చున్నాం.

"ఇప్పుడు చెప్పు.ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నావు?'' అడిగాడాయన.

"కష్టాలు భరించలేక'' నా గొంతు నాకే కొత్తగా వినిపించింది.

"ఓహో... అలాగా! మరి ఆ కష్టాలు తీరడానికి నీ వంతు ప్రయత్నం ఏమైనా చేసావా?'' ఆయన గొంతులో వెటకారం ధ్వనించింది.

తలెత్తి ఆయనకేసి చూసాను.

కళ్లల్లో అదే ప్రశాంతత.

"ఆ చేస్తూనే వున్నాను. భగవంతుడ్ని నమ్ముకున్నాను. ప్రతిరోజూ ఏదో ఒక గుడికి వెళతాను. వారంలో మూడురోజులు ఉపవాసం చేస్తాను. హుండీలో బోలెడన్ని డబ్బులు సమర్పిస్తాను. అయినా ఆ భగవంతుడికి నా మీద దయలేదు. అందుకే చావుతప్ప నా బాధలు తీరడానికి మరో మార్గం కనిపించలేదు.''

"ఇప్పుడు చావడానికి కూడా ధైర్యం చాలడం లేదు... అవునా. సరే.. అయినా అసలు నీకున్న కష్టాలు, బాధలు ఏమిటో చెప్పు'' అన్నాడాయన.

"ఏం చెప్పమంటారు? డిగ్రీ పరీక్ష తప్పాను. చేతిలో పైసాలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాను'' నా గురించి పూర్తిగా చెప్పడం ఇష్టంలేక కొన్ని కష్టాలే ఏకరువు పెట్టాను.''

"అలాంటప్పుడు ఏదైనా పని చూసుకోవచ్చుగా?''

"అదీ అయింది. వెళ్లిన ప్రతిచోటా అనుభవం వుందా? ఇంగ్లీషు బాగా మాట్లాడతావా అని అడిగేవాడేగానీ, ఇప్పుడే కాలేజీ నుంచి బయటపడ్డాడు కదా వీడికి అనుభవం ఎలా వస్తుందని ఆలోచించేవాడేడి? పైగా వాళ్ల దృష్టిలో తెలుగు మీడియం చదివినవాళ్లంతా పనికిరానివాళ్ళే. వాళ్లకి ఇంగ్లీషు మాత్రమే కావాలి.''

"ఏం నీకు ఇంగ్లీషు రాదా?''

"రాదు'' ఖచ్చితంగానే చెప్పాను.

"మరి నేర్చుకోవచ్చుగా'' సలహా ఇచ్చాడాయన.

"ఆ...రెండు మూడు వేలిస్తే చక్కగా నేర్పుతారు ఇంగ్లీషు. కానీ నా దగ్గర ఉండాలికదా'' అన్నాను.

"సరే ఇంగ్లీషు నేర్చుకోవడానికి డబ్బులు లేక మానేసావు. మరి డబ్బు కట్టి కూడా పరీక్ష ఎందుకు తప్పావు?''

'చదివినది గుర్తుండదు. నేను బాగానే రాసాను. కానీ దిద్దడంలోనే ఏదో పొరపాటు జరిగింది'లాంటి కారణాలు చెప్పదలచుకోలేదు నేను.

అవేవీ కారణం కాదని నాకు తెలుసు. కానీ ఎందుకు తప్పానో నాకే తెలియలేదు. అందుకే నేనేమీ మాట్లాడలేదు.

"బహుశా చదివింది గుర్తులేదేమో. లేకపోతే నువ్వు సరిగానే రాసుంటావు. కానీ సరిగా దిద్దివుండరు కదూ?''

తలెత్తి ఆయనకేసి చూసాను.

చిన్నగా నవ్వుతున్నాడాయన.

నేను మళ్లీ తల కిందకు వంచేసాను. నా మనసులో వున్నది ఆయనెలా తెలుసుకున్నాడు?

"పరీక్ష పాసయ్యేలా చేస్తే కొబ్బరికాయలు కొడతాననిగానీ, ప్రదక్షిణాలు చేస్తాననిగానీ ఇంకా చాలా రకాలు ఉన్నాయిగా. అలాంటి మొక్కులేం మొక్కుకోలేదా నీ దేవుళ్లకి? వాళ్లయినా పాస్ చేయిద్దురేమో?'' మళ్లీ ఆయనే అన్నాడు.

"మీకు దేవుడిమీద నమ్మకంలేదా?'' అడిగాను.

"నీకో విషయం చెప్పనా? ప్రపంచంలో చాలా మంది ఈ ప్రపంచంలో ఏదో ఒక శక్తివల్లనే ఇలా వుందని నమ్ముతారు. ఆ శక్తి ఏమిటో ఎవరికీ తెలియదు. మనకు తెలియనివి, ఎప్పటికీ తెలుసుకోలేనివి ఈ ప్రపంచంలో చాలా వున్నాయి. మనం తెలుసుకోలేని ఆ శక్తికే భగవంతుడని పేరు పెట్టుకున్నాం'' కాసేపు ఆగాడు ఆయన.

"అంటే ఏదో తెలియని శక్తిని దేవుడని గుడ్డిగా నమ్ముతున్నామనా మీ ఉద్దేశ్యం?'' కొద్దిగా కోపం ధ్వనించింది నా గొంతులో.

ఆయన మళ్లీ ప్రశాంతంగా నవ్వాడు.

రెండుమూడు నిమషాలపాటు సముద్రంవైపు తదేకంగా చూసాడాయన.

తరువాత అన్నాడు "చూడూ! ఏదో మనకు తెలియని శక్తి మనల్ని అనుక్షణం కాపాడుతూ ఉంటుందని అనుకుంటే మనసులోని భయం తొలగిపోతుంది. మన పూర్వీకులు అందుకనే మనకు దేవుడనే శక్తిని ఇచ్చాడు. అది ఎప్పటికీ మనలను కాపాడుతూనే వుంటుంది.''

"నా కష్టాలు తీరడానికి, మీరు చెప్పే విషయాలకి సంబంధం లేదేమో అనిపిస్తోంది నాకు.''

"చాలా వుంది. చూడు. గాలిలో దీపం పెట్టి దేవుడిదే భారం అనకూడదు. మన చేతులు అడ్డుపెట్టి మన ప్రయత్నం మనమూ చేయాలి.''

"నాకేమీ అర్థం కావడంలేదు'' అన్నాను.

"అంటే... నువ్వు పరీక్ష పాసవ్వాలంటే బాగా చదివి బాగా రాయాలి. అంతేగానీ 'భగవంతుడా! నీదే భారం' అని రోజూ గుడికి వెళ్లి పూజలు చేస్తే మాత్రం ఆ దేవుడు వచ్చి నీ పరీక్షలు రాయడుగా? భగవంతుడ్ని నమ్ము. వద్దనను. కానీ ఆ నమ్మకంలో సగమైనా నిన్ను నువ్వు నమ్ముకో. నీవంతు నువ్వు పూర్తిగా ప్రయత్నం చేయి. ఫలితాన్ని మాత్రమే భగవంతుడికి వదులు. ఇంకొక విషయం...ప్రపంచంలో నీకంటే ఎక్కువగా కష్టాలు ఉన్నవాళ్ళు, బాధలు పడుతున్నవాళ్లు ఉన్నారు. చావే అన్నిటికీ పరిష్కారమైతే వాళ్లంతా నీకన్నా ముందే ఇక్కడ ఉంటారు. సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కోవడానికి సిద్ధపడాలేగానీ వాటి గురించి దూరంగా పారిపోకూడదు'' చెప్పడం ముగించి ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడాయన.

నిముషాలు గడుస్తున్నాయి.

ఆయన చెప్పిన విషయాలే ఆలోచిస్తూ కూర్చుండిపోయాను.

ఆయన లేచి నిల్చున్నాడు.

"నేనిక వెళ్లాలి. మళ్లీ సముద్రం వైపు వెళ్లవని నమ్ముతున్నాను'' బట్టలకు అంటిన ఇసుకని దులుపుకుంటూ అన్నాడు.

అప్పుడడిగాను నేను "మీరెవరు?''

రెండడుగులు వేసి ఆగి వెనక్కి తిరిగి చూసాడాయన.

"నేను రోజూ ఇక్కడకు వస్తుంటాను. చాలా రోజులుగా నిన్ను గమనిస్తున్నాను. నీ ముఖంలో నిరాశా, నిస్పృహ... ఇవన్నీ గమనిస్తే ఏదో ఒక రోజు నువ్వీ పని చేస్తావనిపించింది. నా అంచనా తప్పుకాలేదు. సరే ఇక ఇప్పుడా పని చేయవుగా. వస్తాను. ఆ... నీ భగవంతుడ్ని మాత్రం మర్చిపోకేం. నమ్మినవారికి తప్పకుండా ఏదో ఒక దారి చూపిస్తాడు'' నవ్వుతూ వెళుతున్నాడాయన.

ఆ నవ్వులో ఎన్నో అర్థాలు కనిపించాయి నాకు. ఆయన కనుమరుగైపోయేవరకూ అటే చూస్తూ నిలబడిపోయాను.

నిజమే నమ్ముకున్నవాళ్లకి తప్పకుండా దారి చూపిస్తాడు భగవంతుడు.

అందుకే తన ప్రాణాలు తీసుకోకుండా ఆ వ్యక్తిని పంపించాడు. తనకో దారి చూపించాడు. ముందు నన్ను నేను నమ్ముకోవాలి. కన్నవాళ్లను సుఖపెట్టాలి. తనమీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారు. అవన్నీ తీర్చడానికి తప్పకుండా ప్రయత్నించాలి. ఆపైన నేను నమ్ముకున్న నా భగవంతుడు ఉండనే ఉన్నాడు.''

